ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
సోమవారం 26 మే 2025



బియ్యం కార్డులకు దరఖాస్తుల వెల్లువ



చిత్తూరు కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి): అన్ని సంక్షేమ పథకాలకు కీలకమైన బియ్యం కార్డులు పొందడానికి.. మార్పు, చేర్పులకు ప్రజలు పరుగులు పెడుతున్నారు. దీర్ఘకాలంగా కొత్తవి మంజూరు చేయకపోవడంతో నిరీక్షిస్తున్నవారికి ఈనెల ఏడో తేదీనుంచి ప్రభుత్వం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఇప్పటికే కుప్పలు, తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. మొదట్లో సర్వర్ మొరాయించినా జనం ఒకటికి రెండు సార్లు సచివాలయాలకు వెళ్లి ఓపిగ్గా సమర్పిస్తున్నారు. గతంకంటే సర్వర్ పనితీరు మెరుగైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ ప్రామాణికంగా దరఖాస్తులను సచివాలయాల్లో స్వీకరిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో డిజిటల్ సహాయకుల లాగిన్‌లో నమోదు చేశాక వీఆర్వో లాగిన్‌కు నివేదిస్తున్నారు. రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసే ప్రతి వ్యక్తికి ఈకేవైసీ తప్పనిసరి. ఆ తర్వాత తహసీల్దార్ లాగిన్‌కు పంపుతారు. అక్కడ ఆమోదం తెలిపాక అర్జీదారులకు రేషన్‌కార్డు నెంబర్‌తో సెల్‌ఫోన్‌కు సంక్షిప్త సమాచారం (ఎస్ఎంఎస్) వస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వస్తున్న దరఖాస్తుల్లో అత్యధికంగా అదనపు సభ్యులను చేర్చడానికే ఇస్తున్నారు.

జూన్‌లో స్మార్ట్ కార్డులు

గత వైసీపీ ప్రభుత్వం రేషన్‌కార్డులను రద్దుచేసి బియ్యం కార్డులను జగన్ బొమ్మతో పంపిణీ చేసిన విషయం తెలిసిందే. వీటికి బదులుగా సమగ్ర వివరాలతో కూడిన స్మార్ట్ బియ్యం కార్డులను లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నిరంతర ప్రక్రియ

కొత్త రేషన్ కార్డులు, ఇతర సేవలకు ఇది నిరంత ప్రక్రియగా ప్రభుత్వం ప్రకటించింది. ఎనిమిది రకాల సేవలకు దరఖాస్తులు వస్తున్నాయి. ఇందులో రేషన్ డిపోల అప్‌డేషన్ మినహాయిస్తే మిగిలిన ఏడింటికి జనం దరఖాస్తు చేసుకోవచ్చు. సర్వర్ పనితీరు మెరుగైంది.

- శంకరన్, డీఎస్వో, చిత్తూరు

విభాగాల వారీగా వచ్చిన దరఖాస్తులు

విషయం	సంఖ్య
సభ్యుల చేరిక	24,721
కార్డు విభజన	2,688
కొత్త కార్డులు	3,190
చిరునామా మార్పు	599
ఆధార్ సవరణ	442
సభ్యుడి తొలగింపు	530
కార్డుల సరెండర్	41
మొత్తం	32,211

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తారన్నారు. దీంతోపాటు నియోజకవర్గ, మండల స్థాయిల్లో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి నియోజకవర్గ, మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని ఆదేశాలిచ్చారు.

పోలీసు కార్యాలయంలో రద్దు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరగాల్సిన పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనలో ఉండటంతో ఈ కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి.. జిల్లా కేంద్రానికి రావద్దని సూచించారు.

పంచాయతీల్లో ఖాళీ పదవులపై వివరాల సేకరణ

చిత్తూరు కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో వివిధ కారణాలతో ఖాళీ అయిన సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. వివరాలను కంప్యూటర్లలో నమోదు చేసి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు పంపుతున్నారు. జిల్లాలో 696 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 696 సర్పంచ్‌లు, 696 ఉపసర్పంచ్‌లు, 6,541 వార్డు సభ్యుల పదవులు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి ఆరో తేదీనాటికి ఉన్న ఎన్నికల జాబితాలను అనుసరించి ఖాళీ అయిన వివరాలు సేకరిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు తెలిపారు.

విందు భోజనాలు చేస్తున్న కుప్పం నియోజకవర్గ ప్రజలు



బదిలీల కోసం అడ్డదారులు

ఆఫీసు బేరర్ల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

చిత్తూరు సెంట్రల్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఉద్యోగులకు ఈనెల 16 నుంచి జూన్ రెండు వరకు, ఉపాధ్యాయులకు ఈనెల 21 నుంచి జూన్ ఆరో తేదీ వరకు బదిలీలు జరగనున్నాయి. 98 ప్రభుత్వ శాఖల్లో సుమారు 15వేల మంది ఉద్యోగులు ఉండగా, ఉమ్మడి జిల్లా విద్యా శాఖలో ఏకంగా 15,454 మంది టీచర్లు పనిచేస్తున్నారు. బదిలీల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు (ఆఫీసు బేరర్లకు) కలెక్టర్ ఆమోదం తప్పనిసరి కానుంది. అయినా కొందరు అడ్డదారుల్లో ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏం జరుగుతోందంటే.. : ఒక్కో శాఖలో కనీసం రెండు నుంచి నాలుగు సంఘాలు ఉంటాయి. విద్యాశాఖలో ఏకంగా 20కిపైగా సంఘాలు ఉన్నాయి. ఏ సంఘం నేతల లేఖలైనా, బదిలీల్లో ప్రాధాన్యం పొందడానికి కలెక్టర్ ఆమోదం తప్పనిసరి. ఆయా శాఖల్లో ఇలాంటి బేరర్ల సిఫారసు లేఖలను కలెక్టర్‌కు పంపాల్సి ఉంది. కలెక్టర్ అధ్యక్షతన నియమించిన కమిటీ వీటిని క్షుణ్ణంగా పరిశీలించి, ఆయన ఆమోదం తీసుకున్నాకే ఆయా శాఖలకు పంపుతారు. అప్పుడే ఆఫీసు బేరర్లకు బదిలీల్లో ప్రాధాన్యం లభిస్తుంది. ఇక్కడే కొందరు తాము సంఘంలో నేతల మంటూ ఎన్నికల అధికారి, పరిశీలకుల సంతకం లేకుండా కేవలం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ద్వారా ముందు తేదీల్లో తెచ్చిన లేఖలు సమర్పిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇలాంటి వాటిపై కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

తిరుమల కాలిబాటలో చిరుత సంచారం

భక్తులను గుంపుగా పంపుతున్న విజిలెన్స్ అధికారులు

తిరుమల, మే 25 (ఆంధ్రజ్యోతి): అలిపిరి నుంచి తిరుమల నడక మార్గంలో ఆదివారం రాత్రి చిరుత సంచారం కలకలం సృష్టించింది. ఈ మార్గంలోని 350వ మెట్టువద్ద చిరుతను చూసిన కొందరు భక్తులు హడలిపోయారు. అక్కడి నుంచి దూరంగా వెళ్లిపోయారు. చిరుతసంచార సమాచారాన్ని సమీపంలోని సిబ్బందికి తెలియజేశారు. దీంతో విజిలెన్స్ అధికారులు అప్రమత్తమయ్యారు. మెగాఫోన్‌తో విజిలెన్స్ సిబ్బందిని ఏర్పాటు చేసి భక్తులను గుంపుగా తిరుమలకు పంపారు. ఒంటరిగా ఎవరూ వెళ్లొద్దని సూచించారు. అలాగే అటవీశాఖ సిబ్బంది చిరుత సంచరించిన ప్రదేశానికి చేరుకున్నారు. చిరుత అడవిలోకి వెళ్లిపోయేలా శబ్దాలు చేశారు.

జనసంద్రం... శివపురం

ఘనంగా చంద్రబాబు గృహప్రవేశం

- ఉదయంనుంచి మధ్యాహ్నం దాకా విందు భోజనాలు
- నియోజకవర్గ ప్రజలతో ఫొటో సెషన్
- ఆత్మీయ పలకరింపులు



గృహప్రవేశ కార్యక్రమంలో పూజలు

కుప్పం/శాంతిపురం, మే 25(ఆంధ్రజ్యోతి): వచ్చీపోయే జనాలు.. సుష్టుగా భోజనాలు.. ఆత్మీయ పలకరింపులు.. అడిగినవారికల్లా ఫొటో సెషన్లు.. ముఖ్యమంత్రి చంద్రబాబు గృహప్రవేశం జాతరను తలపించింది. ఆయన సొంత ఇల్లు నిర్మించుకున్న శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ శివపురం పరిసరాలు వేలాదిమంది జనసందోహంతో జాతరను తలపించింది. చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు ఆదివారం తెల్లవారుజామున 4.30-5.00 గంటల ప్రాంతంలో గృహప్రవేశం చేశారు. ఇంట్లో హోమం వెలయించి సంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు. చంద్రబాబు దంపతుల కుమారుడు, మంత్రి నారా లోకేశ్, నారా బ్రాహ్మణి దంపతులు కూడా ఈ పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 9-10 గంటల దాకా పూజలు కొనసాగాయి.11.30 గంటలకు నలుగురూ నూతన గృహం ఎదుట ప్రత్యేకంగా నిర్మించిన షెడ్డులోకి వచ్చి ఆసీనులయ్యారు.ప్రజలకు కనిపించి ఆశీర్వాదాలు స్వీకరించారు. ఆత్మీయంగా పలకరిస్తూ జనాలతో కలిసి ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 2.30 గంటలదాకా ఏకధాటిగా కొనసాగింది. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, పక్కనే ఏర్పాటు చేసిన భోజనశాలకు వెళ్లి, అక్కడ భోజన ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడడక్కడా భోజనం చేస్తున్న వ్యక్తులను పలకరించి, భోజనాలు ఎలా ఉన్నాయని కనుక్కున్నారు.అనంతరం నూతన గృహంలో కుప్పం నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ, బూత్ ఇన్‌చార్జుల తో సమావేశమై కుప్పం నియోజకవర్గ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులతోపాటు, నారా లోకేశ్ దంపతులు కూడా ఆదివారం రాత్రి నూతన గృహంలోనే బస చేశారు.



చంద్రబాబు గోపూజ

జాతరను తలపించిన గృహప్రవేశం

శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ శివపురం గ్రామం వద్ద నిర్మించిన ముఖ్యమంత్రి చంద్రబాబు గృహప్రవేశం జాతరను తలపించింది. శనివారం రాత్రికే ఆయనతోపాటు కుటుంబ సభ్యులందరూ కుప్పం చేరుకున్నారని తెలియడంతో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆదివారం ఉదయం 7 గంటలకల్లా ఆ ప్రదేశానికి చేరుకున్నారు. వీరందరికీ టిఫిన్లు, కాఫీలు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన భోజనశాలల్లో పెడుతూ వచ్చారు. టిఫిన్లు ముగుస్తున్నాయనంగా ఉదయం 10.30 గంటల నుంచే మధ్యాహ్న భోజనాలను వడ్డించడం ఆరింభించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన భోజనాలు సాయంత్రం మూడునాలుగు గంటల దాకా కొనసాగుతూనే ఉన్నాయి. సుమారు 30 వేలమంది నియోజకవర్గ ప్రజలు గృహప్రవేశానికి హాజరై భోజనాలు చేసివెళ్లారు.

ఎంపీ, ఎమ్మెల్యేల హాజరు

చంద్రబాబు గృహప్రవేశానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు పలువురు హాజరయ్యారు.ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు , ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి,పులివర్తి నాని, జగన్మోహన్, మురళీమోహన్, గాలి భానుప్రకాష్, థామస్,ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, చుడా చైర్ పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, సుగుణమ్మ, స్థానిక నాయకులు ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్. సురేశ్‌బాబు, కుప్పం మున్సిపల్, కుప్పం మండల, శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, విశ్వనాథనాయుడు, బాబు నాయుడు, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఎం సెక్రటరీ ప్రద్యుమ్న, డీఐజీ షిమోషీ బాజ్‌పాయి, కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, ఎస్పీ మణికంఠ, కడ పీడీ వికాస్ మర్మత్, డీఎఫ్‌వో భరణితో పాటు పలువురు జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు గృహప్రవేశానికి హాజరయ్యారు.

సీహెచ్‌వోల సమ్మె విరమణ

చిత్తూరు రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వోలు) 27 రోజులుగా చేస్తున్న సమ్మెను ఆదివారం విరమించినట్లు ఏపీఎంసీఏ జిల్లా నాయకులు కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో తమ సమస్యలపై చర్చించామన్నారు. వారు ఇచ్చిన హామీతో సమ్మెను విరమించినట్లు పేర్కొన్నారు. సహకరించిన అన్ని కేడర్లవారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మామిడి ధర పతనం



పాకాల, మే 25 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల కారణంగా ఆలస్యంగా పూత రావడం.. దిగుబడి తక్కువగా ఉండటంతో ఈ ఏడాది మామిడి ధరలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావించారు. కానీ, ఆశించిన ధరల్లేకపోవడంతో నిరాశ చెందారు. పాకాల మండలం దామలచెరువులోని మ్యాంగోనగర్‌లో సుమారు 120 మండీలున్నాయి. సీజన్‌లో ఒక రోజుకు.. ఒక్కో మండీలో 20 నుంచి 30 టన్నులు సరాసరి క్రయ విక్రయాలు జరుగుతాయి. పులిచెర్ల, ఎర్రావారిపాళ్యం, చిన్నగొట్టిగల్లు, రొంపిచెర్ల, పీలేరు. సదుం, సోమల, ఐరాల, పూతలపట్టు, పెనుమూరు, చంద్రగిరి మండలాల రైతులు ఇక్కడికి మామిడి కాయలు తీసుకొస్తారు. రూ.కోట్లలో వ్యాపార లావాదేవీలు జరుగుతాయి. సీజన్ ప్రారంభంలో బేనీషా నాణ్యతను బట్టి టన్ను రూ.25వేల నుంచి 35 వేలు, పులేరా రూ.15 వేల నుంచి 20వేలు, ఖాదర్ రూ.30 వేల నుంచి 40 వేలు, తోతాపురి కలర్ ఎగుమతికి రూ.18 వేల నుంచి 20 వేల వరకు ధరలు పలికాయి. ఇతర రాష్ట్రాల వ్యాపారులు వస్తే ధరలు పెరుగుతాయని రైతులు భావించి పరిమితిగానే కోతలు కోశారు. ఆదివారం ఒక్కసారిగా ధరలు పడిపోయాయి. బేనీషా రకం కాయలు గుజ్జుపరిశ్రమలు టన్ను 9 వేలకు కొనుగోలు చేశారు. ఖాదర్ రూ.27వేల నుంచి 28 వేలు, పుల్లేరా గుజ్జు పరిశ్రమలు టన్ను రూ.7వేలకు కొనుగోలు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వ్యాపారులు, దళారులు, మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు సిండికేట్‌గా మారి ధరలు నియంత్రిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభంకాని తోతాపురి కొనుగోళ్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అధిక విస్తీర్ణంలో పండించే తోతాపురి మామిడికాయల కొనుగోళ్లను గుజ్జు పరిశ్రమలు ఇంకా ప్రారంభించలేదు. కొనుగోలు ధర ప్రకటించలేదు. మామిడి తోటల్లో తోతాపురి కాయలు పక్వానికి వచ్చి కోత దశలో ఉన్నాయి. గుజ్జు పరిశ్రమలు ఇప్పటి వరకు ధర ప్రకటించలేదు. మామిడి గుజ్జు తయారీ పరిశ్రమలు రైతుల నుంచి కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించి నాలుగురోజులైనా జిల్లా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. గిట్టుబాటు ధర కల్పిస్తామని కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు సమావేశమై చర్చించినా ఆచరణలోకి రాలేదు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు చేపట్టాలని మామిడి రైతులు వేడుకుంటున్నారు.



శాంతిపురం మండలం శివపురంలో చంద్రబాబు గృహ ప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, నాని, జగన్మోహన్, భానుప్రకాశ్, ఎంపీ ప్రసాదరావు - చంద్రబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యేలు థామస్, శ్రీనివాసులు, ఎమ్మెల్సీ శ్రీకాంత్



కుప్పం అభివృద్ధి కార్యక్రమాలపై సీఎం సమీక్ష

కుప్పం/శాంతిపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంత బిజీగా ఉన్నా కుప్పం నియోజకవర్గ స్థితిగతులపై ఒక కన్నేసి ఉంచుతారు.అందుకనే గృహప్రవేశ వేడుకలు ముగిశాక ఆదివారం సాయంత్రం అధికార వర్గాలు, తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీతో చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు.కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) పీడీ వికాస్ మర్మత్, కడా అడ్వైజరీ కమిటీ పొలిటికల్ చైర్మన్ అయిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, సభ్యులు ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు తదితరులతో సమావేశమయ్యారు. కడా పరిధిలోని కుప్పం నియోజకవర్గం నాలుగు మండలాలు, కుప్పం మున్సిపల్ అభివృద్ధిపై చర్చించారు. అనంతరం టీడీపీ కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశమై పార్టీ స్థితిగతులపై సమీక్ష జరిపారు. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. విభేదాలు వీడి, కలసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కష్టపడేవారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేశారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ

అమ్మవారిని దర్శించుకున్న 30 వేల మంది భక్తులు ● సేవా టికెట్ల ద్వారా ఒక్కరోజే రూ.13 లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ - అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచివున్న భక్తులు



అమ్మవారి తీర్థప్రసాదాలు అందుకుంటున్న జిల్లా జడ్జి అరుణ సారిక

చౌడేపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో పోటెత్తి అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. వేకువ జామునే అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, పంచామృతాభిషేకాలు నిర్వహించి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావటంతో వేకువజాము నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. సుమారు 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. వివిధ సేవా టికెట్ల ద్వారా ఒక్కరోజే రూ.13 లక్షల ఆదాయం ఆలయానికి చేకూరింది. చిత్తూరు జిల్లా జడ్జి అరుణసారిక కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ఈవో ఏకాంబరం అమ్మవారి తీర్థప్రసాదాలు, ఫొటోను అందజేశారు.

రేపట్నుంచి కాణిపాకంలో మహాకుంభాభిషేక వేడుకలు

ఐరాల, మే 25 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి అనుబంధంగా ఉన్న వీరాంజనేయ స్వామి గుడిలో మంగళవారం నుంచి ఈనెల 30 తేదీవరకు మహాకుంభాభిషేకాన్ని నిర్వహించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. దాత అనిల్‌కుమార్ సహకారంతో ఆలయాన్ని రాతితో నిర్మించామన్నారు. మూడ్రోజులపాటు జరిగే కార్యక్రమాల్లో ఆలయ ఉభయదారులు, భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని ఈవో కోరారు.

పీడీ, పీఈటీలకు యోగాపై శిక్షణ



శిక్షణకు హాజరైన పీడీ, పీఈటీలు

చిత్తూరు రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక పీవీకేఎన్ కళాశాల మైదానం వద్ద ఉన్న వాకర్స్ అసోసియేషన్ యోగా మందిరంలో ఆదివారం పీడీ, పీఈటీలకు యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మోహన్‌కుమార్ మాట్లాడుతూ.. ఇక్కడ శిక్షణ పొందాక మండల, గ్రామస్థాయిలో వెళ్లి స్థానికులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈనెల 27వ తేదీవరకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. 110 మంది పీడీ, పీఈటీలు పాల్గొన్నారన్నారు.

తిరుమలలో తరగని రద్దీ

● సర్వదర్శనానికి 15 గంటలు

● శనివారం అత్యధికంగా 90,211 మందికి దర్శనం



తిరుమల, మే 25(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగుస్తుండగటం.. వారాంతం కావడంతో తిరుమలకు శుక్రవారం మొదలైన రద్దీ ఆదివారమూ కొనసాగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు భక్తులతో నిండుగా కనిపిస్తున్నాయి. కృష్ణతేజ సర్కిల్ మీదుగా రింగురోడ్డులోని శిలాతోరణం సర్కిల్ వరకు దాదాపు కిలోమీటరు మేర క్యూలైన్ ఉంది. వీరికి 15 గంటలు, టైంస్లాట్ టోకెన్లు, టికెట్ల భక్తులకు మూడు గంటల తర్వాత దర్శనం అవుతోంది. శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధులు, అఖిలాండం, లడ్డూకౌంటర్, అన్నప్రసాద భవనం, బస్టాండ్, సీఆర్వో, ఎంబీసీ, పద్మావతి కార్యాలయాలు, లగేజీ కౌంటర్లు, కల్యాణకట్టల్లో భక్తులు కిటకిటలాడుతున్నారు. శ్రీవారిపాదాలు, పాపవినాశనం కూడా రద్దీగా మారాయి. అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గాల గుండా భక్తులు తరలివస్తున్నారు.

24 రోజుల్లో 17.81 లక్షల మందికి దర్శనం

వేసవి సెలవుల నేపథ్యంలో మే 1 నుంచి 24వ తేదీ వరకు 17.81 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో ఈనెల మొదటివారంలో భక్తుల సంఖ్య సాధారణంగానే కనిపించినా.. గత 15 రోజుల్లో భారీగా వచ్చారు. 4, 5, 10, 17, 18, 21వ తేదీల్లో 80 వేలకుపైగా శ్రీవారిని దర్శించుకోగా, శనివారం ఆ సంఖ్య 90,211 కి చేరింది. గత 24 రోజుల్లో శ్రీవారి హుండీ ఆదాయం రూ.80.82 కోట్లు లభించగా, 7.61 లక్షల మంది తలనీలాలు సమర్పించారు. 51 లక్షల మందికి అన్నప్రసాదాలు, బయట క్యూలలో మరో 20 లక్షల మందికి పాలు, టీ, కాఫీ, మజ్జిగ, స్నాక్స్ పంపిణీ చేశారు. శనివారం ఒక్కరోజే వెంగమాంబ అన్నప్రసాదభవనంలో అత్యధికంగా 93,950 మంది అన్నప్రసాదాలు స్వీకరించారు.

శ్రీవారి మెట్టు వద్ద పోటెత్తిన భక్తులు



శ్రీవారిమెట్టు వద్ద కిటకిటలాడుతున్న భక్తులు

చంద్రగిరి, మే 25(ఆంధ్రజ్యోతి): తిరుమలకు నడిచి వెళ్లే భక్తులతో చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురం సమీపంలోని శ్రీవారి మెట్టు ఆదివారం రద్దీగా మారింది. ఈ మార్గాన ఐదు వేల మందికి మాత్రమే టైమ్ స్లాట్ దర్శన టోకెన్లు ఇచ్చారు. అయితే ఆదివారం దాదాపు పది వేల మంది ఇక్కడికి చేరుకున్నారు. టోకెన్లు లేకపోవడంతో కొందరు నిరాశతో వెనుదిరగ్గా.. చాలామంది తిరుమలకు నడిచి వెళ్లారు. సర్వదర్శనంలో స్వామిని దర్శించుకున్నారు. ఇక్కడి సెక్యూరిటీ సిబ్బంది స్థానిక ఆటోలను మాత్రం ముందుగా అనుమతించి.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను ఆపేస్తున్నారని భక్తులు ఆరోపించారు. దీనివల్ల తమకు టోకెన్లు అందడంలేదంటూ వారు సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.

వరసిద్ధుడి సేవలో టీటీడీ చైర్మన్



ఐరాల(కాణిపాకం), మే 25 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడిని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. అలాగే స్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రధనశేఖర్, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కామేశ్వరరావు కూడా వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరిని ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.





టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి, జస్టిస్ చంద్ర ధనశేఖర్‌కు, జస్టిస్ కామేశ్వరరావుకు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు



ఆకట్టుకున్న అర్జున తపస్మాన్

సోమల, మే 25 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నంజంపేట గార్గేయ నదీతీరంలోని గార్గేయ గౌరీలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న మహాభారత యజ్ఞ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పగలు అర్జున తపస్మాన్ ఘట్టాన్ని భాగవతారణి రత్నకుమారి భక్తులకు విశదీకరించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన తపస్మాన్‌కు భక్తులు పూజలు జరిపారు. అనంతరం అర్జున వేషధారి తపస్మాన్‌ను అధిరోహించే క్రమంలో పద్యాలను భక్తులకు వివరించి మన్నలను పొందారు. మహిళలు తమ కోర్కెలు తీరాలని తపస్మాన్ వద్ద తడిబట్టలతో వరపడి పూజలు చేశారు. ఉభయదారులు చీకలవారిపల్లె రామూర్తి కుటుంబసభ్యులు ఆలయంలో పంచపాండవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిపి, భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ధర్మకర్త గుత్తా జయలలితమ్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పంట పొలాలపై ఆగని గజదాడులు

సోమల, మే 25 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని పలు ప్రాంతాల్లో ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయని రైతులు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి చిన్న ఉప్పరపల్లె పంచాయతీ శీలయ్యగారిపల్లె వద్ద ఏనుగుల మందలోని రెండు ఏనుగులు మామిడి, అరటి, కొబ్బరి, సపోటా చెట్లను ధ్వంసం చేశాయి. రమణ అనే రైతుకు చెందిన పొలాల్లో పలుపంటలను ధ్వంసం చేశాయి. సదుం మార్గంలోని తారురోడ్డుపై రెండు ఏనుగులు సంచరించడంతో గ్రామస్తులు హడలిపోయి సమీప గ్రామాల ప్రజలకు సమాచారం తెలియచేశారు. శుక్రవారం రాత్రి అటవీశాఖ అధికారులు, రైతులు మూకుమ్మడిగా ఏనుగుల మందను జిల్లేడు కనుమ(ఐరాల మండలం) వైపు టపాసులు పేల్చుతూ దారి మళ్లించినట్లు రైతులు తెలిపారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో పంట పొలాలపై ఏనుగులు దాడులు చేస్తూ రైతులను నష్టపరుస్తున్నాయి.

ఫ్లెక్సీలు చింపేశారని టీడీపీ నాయకుల ధర్నా



టీడీపీ నాయకులు ధర్నా చేయటంతో నిలిచిపోయిన వాహనాలు - ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు

చౌడే పల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం ఫ్లెక్సీలు చింపేశారని ఆ పార్టీ నాయకులు ఆదివారం రాత్రి ధర్నా నిర్వహించారు.ఈ నెల 16న చౌడే పల్లె మండలంలోని కాటిపేరి పంచాయతీలో అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ ప్రారంభోత్సవ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు ఎంపీడీవో కార్యాలయం ముందు, బస్టాండు తదితర ప్రాంతాల్లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, లక్ష్మీపతిరాజు, స్థానిక నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మే 25న టీడీపీ నాయకుడు, పారిశ్రామిక వేత్త సుదర్శనరాజు పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమానులు రెండు రోజుల క్రితం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎంపీడీవో కార్యాలయం ముందు ఉన్న ఫ్లెక్సీలను చింపేశారని తెలిసి స్థానిక టీడీపీ నాయకులు ధర్నా చేశారు. సుమారు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు వచ్చి సర్ది చెప్పి టీడీపీ నాయకుల ధర్నాను విరమింపజేసి, ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఎస్ఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు పరిశీలించి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలు



గోవిందరాజస్వామి హైస్కూల్‌లో పరీక్ష రాసేందుకు వస్తున్న అభ్యర్థులు - సమయం దాటి వచ్చారని అనుమతించకపోవడంతో గేటు బయటే అభ్యర్థులు

తిరుపతి(కలెక్టరేట్), మే 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 5,261మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉంది. వీరిలో ఉదయం రాత పరీక్షలకు 2,941 మంది, మధ్యాహ్నం సెషన్‌కు 2,929 మంది హాజరయ్యారు. తిరుపతిలో 13 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. ఉదయం 9.30 నుంచి 11.30 వరకు పేపర్-1.. మధ్యాహ్నం 2.30 నుంచి 4.30గంటల వరకు పేపర్-2 పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను రాష్ట్ర పరిశీలకుడు కోన శశిధర్, జాయింట్ సెక్రటరీ అజ్మీరా, కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించారు.

పలమనేరుకు రేపు ఆర్టీసీ ఎండీ, ఈడీల రాక

తిరుపతి(ఆర్టీసీ), మే 25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు అప్పలరాజు, చెంగల్‌రెడ్డి (విజయవాడ ప్రధాన కార్యాలయం), చంద్రశేఖర్(కడప జోన్) సోమ, మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. వారు మధ్యాహ్నం రేణిగుంటలోని విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి సత్యవేడు డిపోకు వెళతారు. అనంతరం పుత్తూరు డిపోను సందర్శించి రాత్రికి తిరుపతికి చేరుకుంటారు. మంగళవారం ఉదయం పలమనేరు, కుప్పం డిపోలను సందర్శించి తిరుగుప్రయాణమవుతారు. అత్యధిక నష్టాలతో నడుస్తున్న ఈ నాలుగు డిపోల పరిస్థితిపై సమీక్షిస్తారు. నష్టాల నుంచి గట్టెక్కడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారు.

పూర్వ విద్యార్థుల కలయిక



ఆత్మీయంగా కలసిన పూర్వ విద్యార్థులు

చౌడేపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌లో 1991-92 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు చౌడేపల్లెలోని కడియాల శరత్ గార్డెన్‌లో ఆదివారం ఆత్మీయంగా కలిశారు. పూర్వపు విద్యార్థులందరూ వారి వారి కుటుంబ పరిస్థితులు, క్షేమ సమాచారాలు ఒకరిని ఒకరు అడిగి తెలుసుకున్నారు. వారు చదువుకున్న స్కూల్ అభివృద్ధి కోసం సహకరించనున్నట్లు తెలిపారు. మిత్రులందరూ కలసి ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి వారి బ్యాచ్‌లో పేద కుటుంబాలకు, పేద విద్యార్థులకు ఆర్థికంగా సహాయం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన సల్లాపురెమ్మ ఉత్సవాలు



ఆలయంవద్ద మహిళల పూజలు



చందనాలంకారంలో సల్లాపురెమ్మ

బైరెడ్డిపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పట్టణంలోవున్న సల్లాపురెమ్మ ఆలయ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు మునివీరయ్య, వీరభద్రయ్య, నాగేంద్రప్రసాద్ ఆలయం వద్ద శాస్త్రోక్తంగా గంగపూజ, గణపతి పూజ, అగ్నిపూజ, ప్రధానకలశస్థాపన, గణపతి, నవగ్రహ హోమాలు నిర్వహించారు. 108 బిందెల నీళ్లతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోగా, నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

తూర్పుగడ్డలో ఘనంగా గంగజాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న టీడీపీ నాయకులు

బైరెడ్డిపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుగడ్డలో గంగజాతర ఘనంగా జరుపుకున్నారు. శనివారం రాత్రి అమ్మవారి శిరస్సు ఊరేగింపు మేళతాళాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారి విశ్వరూప దర్శనం ఏర్పాటుచేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

హస్తకళల చైర్మన్‌కు సన్మానం



హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న జనసేన నాయకులు

పుంగనూరు రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్‌ను పుంగనూరు జనసేన నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు వారు తెలిపారు. జనసేన మండలపార్టీ అధ్యక్షుడు విరూపాక్షి, హరినాయక్, బాలాజీ నాయక్, వెంకటేశ్, రేవంత్‌కుమార్, కుమార్, టీవీ రమణ, మురళీ, నాగరాజునాయక్, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో ఈఎస్ఐ కార్యాలయం ఏర్పాటు చేయాలి



ఏఐటీయూసీ నాయకుల నిరసన

పుంగనూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో ఈఎస్ఐ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రామచంద్రయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు పుంగనూరు నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం కార్మికులను దృష్టిలో ఉంచుకుని ఈఎస్ఐ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, పట్టణ ఏఐటీయూసీ నాయకులు మున్నా, వెంకటరమణారెడ్డి, రామూర్తి పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

పుంగనూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధంగా తీసుకువస్తున్నట్లు ఎస్‌డీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్వర్‌బాషా తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌డీపీఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు అమలు వల్ల ముస్లింలకు కలిగే నష్టాలపై వివరించారు. దేశంలో రాజ్యాంగ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ పోరాటానికి సిద్ధం కావాల్సి ఉందన్నారు. ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు యూసుఫ్, యూనుస్, అబ్దుల్‌ఘని తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహాభారత ఉత్సవాలు

వెదురుకుప్పం, మే 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కత్తెరపల్లెలోని ద్రౌపది అమ్మవారి వార్షిక మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టం అలరించింది. రాత్రి భక్తుల అగ్నిగుండ ప్రవేశంతో ఉత్సవాలు ముగిశాయి. ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం ఆలయ ఆవరణంలో దుర్యోధనుడి మట్టి బొమ్మను తీర్చిదిద్దగా, దుర్యోధన, భీముడి వేషధారులు.. యుద్ధరీతిని నాటక రూపంలో ప్రదర్శించారు. తర్వాత ధర్మరాజుల పట్టాభిషేకం, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

ముత్యాలమ్మకు 101 బిందెల నీళ్లతో అభిషేకం



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

రొంపిచెర్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం కేంద్రంలోని గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయానికి ఆదివారం మంగళ వాయిద్యాలతో మహిళలు 101 బిందెలతో పసుపు నీళ్ల ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. పూజా సామగ్రి, చీర సారెలు, పొంగళ్లతో వచ్చి అమ్మవారిని కొలిచి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి జంతు బలి ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వల్లిగట్లలో వైభవంగా గంగ జాతర వేడుకలు

సోమల, మే 25 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని వల్లిగట్ల పంచాయతీలో గంగ జాతర వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కొత్తపల్లె, దండువారిపల్లె, పాతూరుల్లో బలిపోతుకు, చల్లకుండలకు ఇంటింటా పూజలు జరిపారు. పాతూరులో అమ్మవారిని ప్రతిష్ఠించడానికి ప్రత్యేక మండపం ఏర్పాటు చేశారు. కొత్తపల్లెలో అమ్మవారికి తొలిపూజలు జరిపి ఊరేగించారు. ఇరికిపెంట పంచాయతీ గంగిరెడ్డిపల్లెలో బోయకొండమ్మ ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కుప్పానికి తరలిన టీడీపీ శ్రేణులు

సోమల, మే 25 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో సీఎం చంద్రబాబు నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ఆదివారం సోమల మండలం నుంచి టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, హరిప్రసాద్, వేణుగోపాల్ నాయుడు, అష్రఫ్ అలీ, పి.శ్రీనివాసులు, బాలాజీ నాయుడు, సుబ్బరాయులు, రమేశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



భీమ, దుర్యోధన పాత్రధారుల సంవాదం

కల్లూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం మంగళంపేటలోని ద్రౌపది ధర్మరాజుల ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన మహాభారతం యజ్ఞంలో భాగంగా చివరిరోజు ఆదివారం దుర్యోధన వధ ఘట్టం ఎంతగానో అలరించింది. ఉదయం ద్రౌపది సమేత పాండవుల విగ్రహాలకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో బంకమట్టితో దుర్యోధనుడి బొమ్మను రూపొందించి పూజలు నిర్వహించారు. దుర్యోధనుడిని భీమసేనుడు మడుగు నుంచి రప్పించే సన్నివేశం ఆకట్టుకుంది. దుర్యోధనుడు, భీమసేనుల మధ్య యుద్ధ సన్నివేశాలు, పద్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. భీమసేనుడు దుర్యోధనుడి తొడపై గదతో కొట్టి వధించి ఆ రక్తాన్ని ద్రౌపదిదేవి కురులకు పూసే సన్నివేశాలకు పాత్రధారులు జీవంపోశారు. అనంతరం ధర్మరాజు పట్టాభిషేక కార్యక్రమం వేదోక్తంగా నిర్వహించారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణపై చర్యలు చేపట్టాలి





పుంగమ్మ చెరువుపై నిల్వ చేస్తున్న వ్యర్థపు మట్టి - మీడియాతో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పుంగనూరు రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ నాలుగు వైపులా ఉన్న చెరువుల ఆక్రమణలపై అధికారులు స్పందించకపోతే మాలమహానాడు ఆధ్వర్యంలో ఆందోళనలు చేట్టడానికి సిద్ధపడుతున్నట్లు మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో పుంగనూరు పట్టణంలో తాగు, సాగునీటి సమస్య రాకుండా పట్టణం చుట్టూ పుంగమ్మ చెరువు, సుబ్బమ్మ చెరువు, రాయలచెరువు, మేలుపట్ల చెరువులను నిర్మించినట్లు తెలిపారు. గత ఐదేళ్లుగా చెరువులను ఆక్రమించి చదును చేసి రియల్ ఎస్టేట్ భూములుగా మార్చి విక్రయాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. రోజు రోజుకు ఆక్రమణకు గురికావడంతో చెరువులు కుచించుకుపోతున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పలుబడి ఉన్న వ్యక్తులు చెరువులను తవ్వి ఇసుక, మట్టిని రియల్ ఎస్టేట్ భూములకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాల్సి ఉందన్నారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టమోటా, మామిడి రైతులకు గిట్టుబాటుధర కల్పించాలి

పలమనేరు, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా రైతాంగానికి సిరులు కురిపిస్తామంటూ చేస్తున్న వాగ్దానాలు కేవలం కంటి తుడుపు చర్య తప్ప రైతాంగానికి ఒరిగిందేమీ లేదని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.జనార్దన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి, టమోటా రైతాంగం గిట్టుబాటు ధరలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు గుజ్జు ఫ్యాక్టరీ యజమానులు, కొందరు రైతులతో జిల్లా అధికారులు రెండు దఫాలు ఉత్తుత్తి సమావేశాలు నిర్వహించారేతప్ప నేటికీ గిట్టుబాటు ధర కల్పించే విషయంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రంతో సఖ్యత ఉన్న నేపథ్యంలో జిల్లాలో స్టాకు ఉన్న గుజ్జు నిల్వలు ఎగుమతులకు అవకాశం కల్పించాలని, స్థానికంగా ఆలయాల్లో ఉచితంగా భక్తులకు సరఫరా చేసి తద్వారా యజమానుల సమస్య పరిష్కారానికి తోడ్పడాలన్నారు. తోతాపురికి కనీస గిట్టుబాటు ధర కిలోకు రూ.30, టమోటాకు కనీస గిట్టుబాటు ధర రూ.20 కల్పించాలని డిమాం డు చేశారు. ప్రభుత్వం ప్రోత్సాహకం కిలోకు కనీసం రూ.5 అందజేసి ఆదుకోవాలన్నారు.

మహానాడుకు మైనార్టీలు తరలిరావాలి

పుంగనూరు రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 26, 27, 28 తేదీల్లో కడపలో జరిగే మహానాడు కార్యక్రమానికి పుంగనూరు నియోజకవర్గం నుంచి మైనార్టీలు అధిక సంఖ్యలో తరలి రావాలని టీడీపీ మైనార్టీ నాయకుడు సుహేల్‌బాషా పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ టీడీపీలోనే మైనార్టీలకు గుర్తింపు, పదవులు వచ్చినట్లు తెలిపారు. టీడీపీ పాలనలోనే ముస్లింలకు అనేక విధాలుగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. కొంత మంది అనవసరంగా వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు వల్ల మైనార్టీలకు నష్టం జరుగుతుందని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై వేణుగోపాలుడి చిద్విలాసం







సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతున్న వేణుగోపాల స్వామి - ఊంజల్ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

వెదురుకుప్పం, మే 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై స్వామి వారు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. తర్వాత భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. తదుపరి భక్తాంజనేయస్వామికి అభిషేకం చేశాక సూర్యప్రభ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. సాయంత్రం ఆలయ ఆవరణంలో స్వామివారి ఊంజల్ సేవ నేత్రపర్వంగా జరిగింది. తర్వాత చంద్రప్రభ వాహనంపై స్వామిని ఊరేగించారు. ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబుసురేష్, కంకణ భట్టార్ తరుణ్‌కుమార్, వేదపండితులు నారాయణదాసరి, గోపాలాచారి, శబరీష్, రమేష్, ధన్వంతరి, ప్రశాంత్ పాల్గొన్నారు.

వరదరాజులస్వామికి కానుకగా కవచాలు





కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ సిబ్బందికి కవచాలను అందజేస్తున్న దాత - స్వామి, అమ్మవార్లకు అలంకరించిన కవచాలు

యాదమరి, మే 25 (ఆంధ్రజ్యోతి): యాదమరిలోని త్రివేణి సంగమంలో ఉన్న శ్రీదేవి, పెరిందేవి సమేత వరదరాజులస్వామి వారికి కానుకగా బంగారు తాపడం చేసిన కవచాలను దాతలు అందజేశారు. మంగళవారం వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుండటంతో ఆదివారం ఉదయం ఆలయాన్ని శుద్ధి చేశారు. ఈ సందర్భంగా రాగితో రూపొందించిన బంగారు తాపడం చేసిన కవచాలతోపాటు శంఖుచక్రాలు, హస్తాలు, కిరీటాలను యాదమరికి చెందిన వెంకటేష్ గౌండర్ కుమార్తె హేమలత త్యాగరాజన్ తన కుటుంబీకులతో అందజేశారు. వీటిని రాత్రి నిర్వహించిన గ్రామోత్సవంలో వరదరాజస్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు అలంకరించారు. అంతకుముందు జేష్ఠాభిషేకం, ప్రత్యేక హోమం, పూజ, అభిషేక కార్యక్రమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణ ముఖ్యం

చిత్తూరు సెంట్రల్, మే 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ముఖ్యమని ఎన్‌సీసీ క్యాంపు కమాండింగ్ అధికారి కల్నల్ మోనిష్, ఏవో లోకనాథం అన్నారు. స్థానిక జిల్లా పోలీసు శిక్షణ శిబిరంలో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా ఆదివారం క్యాడెట్లతో కలిసి రిజర్వు ఫారెస్టులో మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణ, అటవీ చట్టాలను క్యాడెట్లకు అటవీ విభాగం అధికారి ఉషా వివరించారు. అనంతరం డ్రిల్, ఫిజికల్ ట్రైనింగ్, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, కార్తీక్, ధనంజయులు, చిరంజీవి, మనోజ్, మహేష్‌రాయ్, మస్తాన్ పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం



మాతమ్మ



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

నింద్ర, మే 25 (ఆంధ్రజ్యోతి): నింద్రలోని ఆది ఆంధ్రవాడలో మాతమ్మ తిరునాళ్లలో భాగంగా అగ్నిగుండం ప్రవేశాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. కంకణం ధరించిన భక్తులు మాతమ్మ వెంట వచ్చి అగ్నిగుండ ప్రవేశం చేయడంతో వారం రోజులుగా జరుగుతున్న తిరునాళ్ల ముగిసింది.

అ'పూర్వ' కలయిక



పెనుమూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు జడ్పీ హైస్కూల్ 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఆనాటి సంగతులను గుర్తుచేసుకుని సందడి చేశారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత హెచ్ఎం చిన్నపరెడ్డి, విశ్రాంత టీచర్ పద్మనాభ నాయుడు, టీచర్ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్

ఒకరికి తీవ్రగాయాలు

పూతలపట్టు, మే 25 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఐరాల మండలం పుల్లయ్యగారిపల్లెకు చెందిన రవికుమార్ పూతలపట్టు మండలం పేట మిట్ట వద్ద ఉన్న ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై బయల్దేరగా మొరవపాటూరు బస్టాప్ వద్దకొచ్చేసరికి ట్రాక్టర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడటంతో స్థానికులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలునుంచి జారిపడ్డ నేపాల్‌వాసికి తీవ్రగాయాలు



గాయపడ్డ అర్జున్

గుడిపాల, మే 25 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడ్డ నేపాల్ వాసికి తీవ్ర గాయాలయ్యాయి. బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న రైలునుంచి ఓ వ్యక్తి మార్గమధ్యం లోని 197రామాపురం వద్ద జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతడిని స్థానికులు గుర్తించి వెంటనే 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడ్డ వ్యక్తి నేపాల్‌కు చెందిన అర్జున్‌గా గుర్తించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య కేసులో భర్త, అత్త అరెస్టు



నిందితుల వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

బంగారుపాళ్యం, మే 25 (ఆంధ్రజ్యోతి): వివాహిత ఆత్మహత్య కేసులో భర్త, అత్తను పోలీసులు అరెస్టు చేశారు. తంబుగానిపల్లె పంచాయతీ వెంకటాపురం దళితవాడలో ఈనెల 23వ తేదీన భర్త, అత్త వేధింపులు భరించలేక నందిని(21) ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలిసిందే. దీనిపై నందిని తల్లి లావణ్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం తంబుగానిపల్లె క్రాస్ వద్ద నందిని భర్త ఉదయ్ కిరణ్, అత్త బుజ్జిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మినీ లారీని ఢీకొన్న బస్సు

- డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు



బోల్తాపడ్డ మినీలారీ

బంగారుపాళ్యం, మే 25 (ఆంధ్ర జ్యోతి): చెన్నై - బెంగళూరు జాతీయ రహదారి మహాసముద్రం టోల్ ప్లాజా వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ గాయపడ్డారు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరు నుంచి తిరుపతి వైపు వెళుతున్న మినీ లారీని విజయవాడకు వెళుతున్న ప్రైవేటు బస్సు వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ లారీ బోల్తాపడింది. అందులోని డ్రైవర్ ఇర్ఫాన్ అన్సారీ, క్లీనర్ అఫ్జల్ అన్సారీలు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మినీ లారీ వాహన యాజమాని దేవరాజులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.







గృహ ప్రవేశం సందర్భంగా సీఎం చంద్రబాబుకు శ్రీవారి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యేలు పులివర్తి నాని, అమరనాథరెడ్డి, మురళీమోహన్, ఆరణి శ్రీనివాసులు, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు - అందరితో కలిసి భోంచేస్తున్న చంద్రబాబు, కుటుంబ సభ్యులు - భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి



గృహ ప్రవేశం సందర్భంగా సీఎం చంద్రబాబుకు శ్రీవారి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యేలు నాని, అమరనాథరెడ్డి, మురళీమోహన్, శ్రీనివాసులు, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చుడా చైర్‌పర్సన్ హేమలత, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు

చుక్కావారిపల్లెలో పొన్నియమ్మ తిరునాళ్ల

గుడిపాల, మే 25 (ఆంధ్రజ్యోతి): రామభద్రాపురం పంచాయతీ చుక్కావారిపల్లెలో పొన్నియమ్మ తిరునాళ్లను గ్రామస్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని పుష్ప పల్లకిలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సుమతి మురళీనాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల హేమాద్రినాయుడు, మాజీ సర్పంచ్ పళణి, బీసీ సెల్ నాయకుడు మోహన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వరదరాజులస్వామికి కానుకగా కవచాలు



కుటుంబీకులతో కలిసి ఆలయ సిబ్బందికి కవచాలను అందజేస్తున్న దాత- స్వామి, అమ్మవార్లకు అలంకరించిన కవచాలు

యాదమరి, మే 25 (ఆంధ్రజ్యోతి): యాదమరిలోని త్రివేణి సంగమంలో ఉన్న శ్రీదేవి, పెరిందేవి సమేత వరదరాజులస్వామి వారికి కానుకగా బంగారు తాపడం చేసిన కవచాలను దాతలు అందజేశారు. మంగళవారం వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుండటంతో ఆదివారం ఉదయం ఆలయాన్ని శుద్ధి చేశారు. ఈ సందర్భంగా రాగితో రూపొందించిన బంగారు తాపడం చేసిన కవచాలతోపాటు శంఖు చక్రాలు, హస్తాలు, కిరీటాలను యాదమరికి చెందిన వెంకటేష్ గౌండర్ కుమార్తె హేమలత త్యాగరాజన్ తన కుటుంబీకులతో అందజేశారు. వీటిని రాత్రి నిర్వహించిన గ్రామోత్సవంలో వరదరాజస్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు అలంకరించారు. అంతకు ముందు జేష్టాభిషేకం, ప్రత్యేక హోమం, పూజ, అభిషేక కార్యక్రమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

పిళ్లారికుప్పంలో 'అర్జున తపస్సు'



కార్యక్రమానికి హాజరైన భక్తులు

గుడిపాల, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిళ్లారికుప్పం వద్ద ఆదివారం మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం అర్జున తపస్సు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున వేషధారి పద్యాలు పాడుతూ తపస్సుమానును అధిరోహిస్తూ.. విభూది పండ్లు, నిమ్మకాయలను భక్తులపై వెదజల్లారు. వీటిని అందుకోవడానికి భక్తులు పోటీపడ్డారు. అనంతరం తపస్సుమాను వద్ద మహిళలు వరపడ్డారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త మొగిలిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేశవపురంలో పోతురాజు కొలువు

విజయపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): కేశవపురంలో పోతురాజు కొలువును ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం పూజలు జరిగాయి. సాయంత్రం భక్తులు అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. రాత్రి పోతురాజును పురవీధుల్లో ఊరేగించారు.

అలరించిన దుర్యోధన వధ



శ్రీరంగరాజపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): 49.కొత్తపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ ఆవరణలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ కార్యక్రమం అలరించింది. భీముడు, దుర్యోధనుడి పాత్రధారులు యుద్ధ సన్నివేశాన్ని పద్యాల రూపంలో పాడి ఆకట్టుకున్నారు. ఆలయంలో ద్రౌపదీ, పాండవుల విగ్రహాలకు పూజలు నిర్వహించి, పొంగళ్లు పెట్టారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశాన్ని నిర్వహించారు. అన్నదానం ఉభయదారులుగా హరిబాబు దంపతులు వ్యవహరించారు. వేడుకలను తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఆలయ ధర్మకర్త నాగరాజు, సురేష్‌బాబు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం



ప్రత్యేక అలంకరణలో మాతమ్మ - అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

నింద్ర, మే 25 (ఆంధ్రజ్యోతి): నింద్రలోని ఆది ఆంధ్రవాడలో మాతమ్మ తిరునాళ్లలో భాగంగా అగ్నిగుండం ప్రవేశాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. కంకణం ధరించిన భక్తులు మాతమ్మ వెంట వచ్చి అగ్నిగుండ ప్రవేశం చేయడంతో వారం రోజులుగా జరుగుతున్న తిరునాళ్ల ముగిసింది.

కత్తెరపల్లెలో ముగిసిన మహాభారత ఉత్సవాలు

వెదురుకుప్పం, మే 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కత్తెరపల్లెలోని ద్రౌపది అమ్మవారి వార్షిక మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టం అలరించింది. రాత్రి భక్తుల అగ్నిగుండ ప్రవేశంతో ఉత్సవాలు ముగిశాయి. ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం ఆలయ ఆవరణంలో దుర్యోధనుడి మట్టి బొమ్మను తీర్చిదిద్దగా, దుర్యోధన, భీముడి వేషధారులు.. యుద్ధరీతిని నాటక రూపంలో ప్రదర్శించారు. తర్వాత ధర్మరాజుల పట్టాభిషేకం, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఏర్పాట్లను కార్యనిర్వాహకులు పర్యవేక్షించారు.



దుర్యోధన వేషధారిని వధించే సన్నివేశం

చంద్రబాబును కలిసిన టీడీపీ నాయకులు

గుడిపాల, మే 25 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం శివపురంలో సీఎం చంద్రబాబు గృహ ప్రవేశం సందర్భంగా ఆయన్ను గుడిపాల మండల టీడీపీ నాయకులు కలిశారు. వీరిలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్లహేమాద్రినాయుడు, మాజీ సర్పంచ్ గోళ్లరవినాయుడు, ఎస్సీ సెల్ నాయకుడు రవి ఉన్నారు.

శుభాకాంక్షలు

నగరి: గృహప్రవేశం సందర్భంగా చంద్రబాబు, భువనేశ్వరి దంపతులకు నగరి నుంచి చలపతి, లతలతోపాటు తెలుగు మహిళలు, యువత శుభాకాంక్షలు తెలిపారు. శివపురం వెళ్లి సారె సమర్పించారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా / స్టాక్ పాయింట్‌గా కేశవపురం ఆదిఆంధ్రవాడ

విజయపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): విజయపురం మండలంలోని కేశవపురం ఆది ఆంధ్రవాడ స్టాక్ పాయింట్‌గా పెట్టుకుని రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. విజయపురం మండలానికి ఆంధ్రా-తమిళనాడు సరిహద్దుల్లో ఆర్కాడు కుప్పం, కనకమ్మసత్రం, మావూరు, పనపాకం, రామంజేరి, గూళూరు, కాంజపాడి, తొంబూరు, పూండి, మోట్టుపాళెం, కనకవల్లిపురం, ముత్తుకొండాపురం, తిరువళాంగాడు, అత్తిపట్టు, కారణి, నెడుంబరం గ్రామాలు ఉన్నాయి. తమిళనాడు పరిసరాల్లో రేషన్ బియ్యాన్ని కిలో రూ. 10 నుంచి రూ.15 వరకు కొనుగోలు చేసి విజయపురం మండలం కేశవపురం ఆదిఆంధ్రవాడలోని ఓ ఇంట్లో నిల్వ చేస్తున్నారు. ఆ తర్వాత టన్ను బియ్యాన్ని రూ.30-40వేల మధ్య విక్రయిస్తున్నారు.



లారీలో లోడ్ చేయడానికి సిద్ధం చేసిన బియ్యం బస్తాలు

మన బియ్యాన్ని కూడా..: మన రాష్ట్రానికి చెందిన రేషన్ బియ్యం కూడా మండలంలోని పలుగ్రామాల్లో ఇదే విధంగా కొనుగోలు చేసి, విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇకనైనా సంబంధిత అధికారులు నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.



లారీలో ఎక్కించిన రేషన్ బియ్యం బస్తాలు

'మహానాడు'ను విజయవంతం చేయండి: థామస్



సమావేశంలో ప్రసంగిస్తున్న థామస్ - హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

శ్రీరంగరాజపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): కడపలో జరగనున్న టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు ప్రభుత్వ విప్ థామస్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్ఆర్‌పురంలోని మండల టీడీపీ కార్యాలయంలో జీడీనెల్లూరు సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ.. మహానాడుకు అధిక సంఖ్యలో జనాలను తరలించేలా మండల పార్టీ అధ్యక్షులు, బూత్ కమిటీ కన్వీనర్లు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహానాడు తర్వాత నియోజకవర్గంలో ప్రతి మండలానికి సంబంధించి, ప్రతి ఒక్కరి అభిప్రాయలు తీసుకున్నాకే పదవులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నాయకులు శ్రీధర్ యాదవ్, గంధమనేని రాజశేఖర్ నాయుడు, మునివర్ధ నాయుడు, వేమ నాయుడు, ఫైనేని మురళి, ఎన్.కుమార్, కృష్ణమ్మ నాయుడు, గురుసాల కిషన్ చంద్, జనార్ధన్‌రాజు, మాధవ నాయుడు, బల్లా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

శివాలయంలో అభిషేక పూజలు



విజయపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం శ్రీరామ నామ క్షేత్రం శివాలయంలో ఆదివారం అభిషేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ పురోహితులు రాంప్రసాద్‌శర్మ తెలిపారు.

16 మందికి దంతమార్పిడి శస్త్ర చికిత్సలు



చిత్తూరు రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన అమ్మఒడి ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నైలోని చెట్టినాడు ఆస్పత్రిలో 16 మందికి దంత మార్పిడి శస్త్ర చికిత్సను ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆ ట్రస్ట్ నిర్వాహకుడు పద్మనాభ నాయుడు తెలిపారు. ఇందుకోసం జిల్లా నలుమూలల నుంచి ఎంపిక చేశామన్నారు. ఆదివారం వీరందరినీ చెన్నైకి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. అక్కడ ఆరు రోజుల పాటు ఆహారం అందించి, బస్‌చార్జీలు ఇస్తామన్నారు.

టీడీపీ నేత కుటుంబానికి పరామర్శ

గంగాధరనెల్లూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): సీనియర్ టీడీపీ నేత దేవరాజులుకు తల్లి లక్ష్మమ్మ (88) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తెల్లవారి జామున మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ థామస్ ఆదివారం ఉదయం టీడీపీ నాయకులతో కలిసి బాలగంగనపల్లెకు వెళ్లి లక్ష్మమ్మ భౌతికకాయానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. దేవరాజులు కుటుంబాన్ని పరామర్శించారు.

కాలువల్లో స్తంభించిన మురుగు



ఐరాల, మే 25 (ఆంధ్రజ్యోతి): ఐరాలకు కూత వేటు దూరంలోని వీఎస్ అగ్రహారంలో కాలువల్లో మురుగు స్తంభించింది. పూడిక పేరుకుని దానిపై మొక్కలు మొలిచాయి. దీనివల్ల పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు ప్రబలి జనం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

161 మందికి వైద్య పరీక్షలు



చిత్తూరు కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): రాముల గుడివీధిలోని జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన నేత్రవైద్య ఉచిత శిబిరానికి స్పందన లభించింది. తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల సహకారంతో నిర్వహించిన శిబిరంలో 161 మంది రోగులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. 93మందిని ఆపరేషన్లకు ఎంపికచేశారు. వీరందరికీ తామే అన్ని ఖర్చులు భరించి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు సంఘం అధ్యక్షుడు సుభాష్ జైన్ తెలిపారు. ప్రేమ్‌చంద్, సాగర్, ప్రవీణ్, లలిత్, కమలేష్, అమిత్ జైన్లు పాల్గొన్నారు.

వల్లిగట్లలో గంగ జాతర

సోమల, మే 25 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని వల్లిగట్ల పంచాయతీలో గంగ జాతర వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కొత్తపల్లె, దండువారిపల్లె, పాతూరుల్లో బలిపోతుకు, చల్లకుండలకు ఇంటింటా పూజలు జరిపారు. పాతూరులో అమ్మవారిని ప్రతిష్ఠించడానికి ప్రత్యేక మండపం ఏర్పాటు చేశారు. కొత్తపల్లెలో అమ్మవారికి తొలిపూజలు జరిపి ఊరేగించారు.

చిత్తూరు నగర అభివృద్ధికి సహకరించండి
● సీఎంను కోరిన సీఎస్‌సీడీఎస్ సభ్యులు



చంద్రబాబుకు బుద్ధుడి బొమ్మను అందజేస్తున్న సీఎస్‌సీడీసీ సభ్యులు

చిత్తూరు సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర అభివృద్ధికి సహకరించాలని సీఎం చంద్రబాబును చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ (సీఎస్‌సీడీఎస్) సభ్యులు కోరారు. ఆదివారం శాంతిపురం మండలం శివపురంలో సీఎం గృహప్రవేశానికి వీరు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎంకు బుద్ధుడి బొమ్మను అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నగరాభివృద్ధికి సహకరించాలంటూ పలు అంశాలను ప్రస్తావించి, వినతిపత్రాన్ని అందజేశారు. ఓసారి అమరావతికి వచ్చి కలవాలని సీఎం సూచించినట్లు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు తాండవమూర్తి, గోపి నాయక్, సత్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

బదిలీలకు దరఖాస్తుల సమర్పణలో టీచర్లు బిజీ



నగరి మండల వనరుల కేంద్రంలో టీచర్ల సందడి

నగరి, మే 25 (ఆంధ్రజ్యోతి): బదిలీల కోసం దరఖాస్తులు సమర్పించడంలో టీచర్లు బిజీగా ఉన్నారు. ఆదివారం నగరి మండల వనరుల కేంద్రానికి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు తరలి రావడంతో కార్యాలయం కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయలు మాట్లాడుతూ 170 మంది దరఖాస్తులు చేసుకోగా.. 109 మంది తప్పనిసరి బదిలీ కోరారని తెలిపారు.

అ'పూర్వ' కలయిక



పెనుమూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు జడ్పీ హైస్కూల్ 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఆనాటి సంగతులను గుర్తుచేసుకుని సందడి చేశారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత హెచ్ఎం చిన్నపరెడ్డి, విశ్రాంత టీచర్ పద్మనాభ నాయుడు, టీచర్ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ముఖ్యం



మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

చిత్తూరు సెంట్రల్, మే 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ముఖ్యమని ఎన్‌సీసీ క్యాంపు కమాండింగ్ అధికారి కల్నల్ మోనిష్, ఏవో లోకనాథం అన్నారు. స్థానిక జిల్లా పోలీసు శిక్షణ శిబిరంలో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా ఆదివారం క్యాడెట్లతోకలిసి రిజర్వు ఫారెస్టులో మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణ, అటవీ చట్టాలను క్యాడెట్లకు అటవీ విభాగం అధికారి ఉషా వివరించారు. అనంతరం డ్రిల్, ఫిజికల్ ట్రైనింగ్, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, కార్తీక్, ధనంజయులు, చిరంజీవి, మనోజ్, మహేష్‌రాయ్, మస్తాన్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైలునుంచి జారిపడ్డ నేపాల్‌వాసికి తీవ్రగాయాలు



గాయపడ్డ అర్జున్

గుడిపాల, మే 25 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడ్డ నేపాల్ వాసికి తీవ్ర గాయాలయ్యాయి. బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న రైలునుంచి ఓ వ్యక్తి మార్గమధ్యంలోని 197రామాపురం వద్ద జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతడిని స్థానికులు గుర్తించి వెంటనే 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడ్డ వ్యక్తి నేపాల్‌కు చెందిన అర్జున్‌గా గుర్తించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.



బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్
● ఒకరికి తీవ్రగాయాలు

పూతలపట్టు, మే 25 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఐరాల మండలం పుల్లయ్యగారిపల్లెకు చెందిన రవికుమార్ పూతలపట్టు మండలం పేట మిట్ట వద్ద ఉన్న ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై బయల్దేరగా మొరవపాటూరు బస్టాప్ వద్దకొచ్చేసరికి ట్రాక్టర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడటంతో స్థానికులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో భర్త, అత్త అరెస్టు



నిందితుల వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

బంగారుపాళ్యం, మే 25 (ఆంధ్రజ్యోతి): వివాహిత ఆత్మహత్య కేసులో భర్త, అత్తను పోలీసులు అరెస్టు చేశారు. తంబుగానిపల్లె పంచాయతీ వెంకటాపురం దళితవాడలో ఈనెల 23వ తేదీన భర్త, అత్త వేధింపులు భరించలేక నందిని(21) ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలిసిందే. దీనిపై నందిని తల్లి లావణ్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం తంబుగానిపల్లె క్రాస్ వద్ద నందిని భర్త ఉదయ్ కిరణ్, అత్త బుజ్జిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

బస్సు ఢీకొనడంతో మినీ లారీ బోల్తా
● డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు



బోల్తాపడ్డ మినీలారీ

బంగారుపాళ్యం, మే 25 (ఆంధ్రజ్యోతి): చెన్నై- బెంగళూరు జాతీయ రహదారి మహాసముద్రం టోల్ ప్లాజా వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ గాయపడ్డారు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరు నుంచి తిరుపతి వైపు వెళుతున్న మినీ లారీని విజయవాడకు వెళుతున్న ప్రైవేటు బస్సు వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ లారీ బోల్తాపడింది. అందులోని డ్రైవర్ ఇర్ఫాన్ అన్సారీ, క్లీనర్ అఫ్జల్ అన్సారీలు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మినీ లారీ వాహన యాజమాని దేవరాజులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై వేణుగోపాలుడి చిద్విలాసం



సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతున్న వేణుగోపాల స్వామి - ఊంజల్ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

వెదురుకుప్పం, మే 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై స్వామివారు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. తర్వాత భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. తదుపరి భక్తాంజనేయస్వామికి అభిషేకం చేశాక సూర్యప్రభ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. సాయంత్రం ఆలయ ఆవరణంలో స్వామివారి ఊంజల్ సేవ నేత్రపర్వంగా జరిగింది. తర్వాత చంద్రప్రభ వాహనంపై స్వామిని ఊరేగించారు. ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబుసురేష్, కంకణ భట్టార్ తరుణ్‌కుమార్, వేదపండితులు నారాయణదాసరి, గోపాలాచారి, శబరీష్, రమేష్, ధన్వంతరి, ప్రశాంత్ పాల్గొన్నారు.